క్లుప్తంగా

పన్ను రాయితీకి 8 రోజులే గడువు

నెహ్రూ నగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2025–26) సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోగా ఏక మొత్తంగా చెల్లించే వారికి మొత్తం పన్నుపై ఐదు శాతం రాయితీ లభిస్తుందని, ఇప్పటి వరకు 32,041 మంది ఈ రాయితీని వినియోగించుకొని రూ.24.50 కోట్లు చెల్లించారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఈ నెల 30లోపు ఆస్తి పన్ను ఏక మొత్తంగా చెల్లిస్తే పన్ను రాయితీ లభిస్తుందని చెప్పారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఒకేసారి ఏక మొత్తంగా చెల్లిస్తే వారికి వడ్డీపై 50 శాతం రాయితీని కూడా ఈ నెలాఖరులోపు చెల్లించి పొందవచ్చని వివరించారు. ఆస్తి పన్నుదారులకు సౌలభ్యంగా జీఎంసీ ప్రధాన కార్యాలయంలో 8, సర్కిల్ కార్యాలయంలోని 6 ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు ప్రతి రోజు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని పేర్కొన్నారు.

వాల్వ్ ఆపరేటర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం

నెహ్రూ నగర్: తూర్పు నియోజకవర్గంలో శివారు ప్రాంతాలకు తాగునీటిని సక్రమంగా అందించకపోవడంపై ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే మద్దిరాల కాలనీలో పర్యటించారు. మా ప్రాంతంలో సక్రమంగా తాగునీరు రావడంలేదని ప్రజలు ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంత వాల్వ్ ఆపరేటర్ తాగునీరు ఆస్పత్రులకు మళ్లిస్తున్న విషయం తెలుసుకున్న ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీళ్లు డబ్బులు పెట్టి తెచ్చుకోవాలా? ప్రజలకు తాగు నీరు అందించే బాధ్యతను కూడా మీరు చేయకపోతే ఎలా అంటూ మండిపడ్డారు. ఈసారి ఇలాంటి తప్పులు జరిగితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్‌వాడీల్లో పేర్లు నమోదు చేసుకోవాలి



నెహ్రూ నగర్: గర్భిణులు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుని సేవలను పొందాలని ఐసీడీఎస్ గుంటూరు అర్బన్ సీడీపీఓ కృష్ణవేణి సూచించారు. గుంటూరు అర్బన్ ప్రాజెక్టు పశ్చిమ 5 సెక్టర్‌లో పోషణ్ పఖ్వాడ్ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోషణ్ ట్రాకర్ యాప్‌లో గర్భిణులు రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. గర్భిణు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. అనంతరం గర్భిణులకు స్త్రీమంతాలు, ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్రీవాణి, డీసీపీఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి కల్పించేందుకు స్కిల్ కాలేజీలలో ఉచిత శిక్షణతో పాటు వసతి కల్పించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీడాప్ స్కిల్ కాలేజీ(అర్జున ఫౌండేషన్) చేబ్రోలు మండలంలో సోలార్ లైటింగ్ అసెంబ్లర్ కోర్సులో శిక్షణ ఉంటుందన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 7032647212, 7032647213 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

మాతృవందన యోజనపై అవగాహన

నెహ్రూనగర్: ప్రధాన మంత్రి మాతృవందన యోజనను ఆరోగ్య శాఖ నుంచి శిశు సంక్షేమ శాఖకు బదిలీ చేసిన నేపథ్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని సీడీపీఓలకు, సూపర్‌వైజర్లకు మంగళవారం మహిళా ప్రాంగణంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయం ఏడీ కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులకు డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఆధార్‌తో లింక్ అయిన బ్యాంక్ అకౌంట్లకు డబ్బు జమ అవుతుందని, అమలులో లబ్ధిదారులకు కలిగించాల్సిన అవగాహనపై సీడీపీఓలకు, సూపర్‌వైజరలకు పీపీటీ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ అధికారి విజయలక్ష్మి, పల్నాడు జిల్లా అధికారి ఉమాదేవి పాల్గొన్నారు.

పరిశుభ్రమైన భూమితోనే ప్రకాశవంతమైన భవిష్యత్

లక్ష్మీపురం: అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా 'గ్రీన్ హౌస్ ఎఫెక్ట్' అన్న అంశంపై చర్చ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారులు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగించేందుకే ఎర్త్ డే పేరుతో ధరిత్రీ దినోత్సవం జరుపుతున్నామని చెప్పారు. పర్యావరణవేత్త ఎన్.సదాశివం మాట్లాడుతూ ప్రపంచ వాతావరణంలో మార్పులు వస్తున్నాయని, దీనినే 'గ్రీన్ హౌస్ ఎఫెక్ట్' అంటారన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త చంద్రయ్య, విశ్లేషకులు వీవీ రావ్, గుప్త ప్రసంగించారు.

స్పందించమేవయ్యా... శ్రీనివాసా!

- తప్పు మీద తప్పు జరుగుతున్నా.. స్పందన కరువు
- దేవదాయశాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు
- ఆలయాల్లో ఇష్టానూసారంగా వ్యవహరిస్తున్న పట్టించుకోని అధికారులు
- ఇప్పటికే అనేక మంది ఈఓలు సెలవులో వెళ్లిన వైనం



నాజ్‌సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం

పట్నంబజారు: ఆలయం అంటే భక్తుల మనోభావాలకు పెద్దపీట. ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు చేసుకుంటూ.. స్వామి వారిని కొలుచుకుంటారు. కళ్ల ముందే ఒకటికి నాలుగు తప్పులు పునరావృత్తం అవుతున్నా.. భక్తుల నుంచి ఫిర్యాదులు అందుతున్నా.. పట్టించుకోవాల్సిన దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు మాత్రం మొద్దు నిద్ర పోతున్నారు. కూటమి నేతలకు ప్రత్యక్షంగానే వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

పర్యవేక్షణ అధికారులకు పట్టడం లేదు..

జిల్లాలోని నాజ్‌సెంటర్‌లో ఉన్న దేవదాయ శాఖ కార్యాలయం డెప్యూటీ కమిషనర్(డీసీ) గుంటూరు, ప్రకాశం నెల్లూరు జిల్లాల అధికారి, అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) జిల్లా అధికారి కార్యాలయాలు ఉన్నాయి. శాఖ పరిధిలోని 6ఏ ఆలయాలకు సంబంధిచి ఏసీలు కార్యనిర్వాహణ అధికారులుగా ఉంటారు. 6బీకి డీసీ, 6సీకి ఏసీలు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాల్సి ఉంది. ఇటీవల ఆలయాల్లో జరుగుతున్న అక్రమ వసూలు, ఆలయాల్లో సౌకర్యాల అంశంపై కనీసం దృష్టి సారించని పరిస్థితులున్నాయి. శాఖలో ఉన్నతాధికారిగా వ్యవహరిస్తున్న అధికారి, కూటమి నేతల సిఫార్సులతో పీఠం ఎక్కారు. ఎక్కడ ఏ అన్యాయం జరిగినా.. అక్రమ వసూలుకు పాల్పడిన కనీసం పట్టించుకోని పరిస్థితులు కనపడుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు.

వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

పట్నంబజారులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉత్సవాలకు అక్రమ వసూలుపై ఆరోపణలున్నాయి. ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు వీటిపై పెదవి విరుస్తున్నారు. టీడీపీ కార్పొరేటర్‌పై సర్వత్రా ఆరోపణలు వచ్చాయి. జిల్లా ఏసీగా పనిచేస్తున్న అధికారి ఈ ఆలయ కార్యనిర్వహణాధికారి బాధ్యతలు పర్యవేక్షిస్తూ.. సెలవులో వెళ్ళిపోవటంపై ఉన్న అంతర్యం ఇప్పటికే అర్థం కాని పరిస్థితి. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం రోజున అన్నదాన కార్యక్రమం చేపట్టేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సన్నద్ధమైన పరిస్థితుల్లో అసలు అన్నదాన కార్యక్రమమే లేకుండా చేసిన ఘనత కూటమి కార్పొరేటర్‌కే దక్కింది. చౌత్రా సెంటర్‌లోని శ్రీ కోదండ రామాలయంలో కూటమికి చెందిన నేతలు ధనుర్మాసం, శ్రీరామనవమికి సంబంధించి అక్రమంగా చేసిన వసూలుపై ఎటువంటి విచారణ లేదు. ఆలయ ఈఓ వారికి ప్రత్యక్షంగా సహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే దీనిని పరిశీలిస్తామని చెప్పిన డీసీ ఇప్పటి వరకు కనీసం పట్టించుకోలేదు.

పాత గుంటూరులోని...

పాతగుంటూరులోని గంగపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి, సిబ్బంది, అర్చకులపై గతంలో ఫిర్యాదులు న్నాయి. ధ్వజ స్తంభానికి భక్తులు దండం పెట్టుకోకుండా ఇనుప తీగలు అడ్డం పెట్టారని, ఒకటికి పలుమార్లు చోరీలు జరిగాయని, ఆలయ ఈఎ, సిబ్బంది వ్యవహార శైలి ఏ మాత్రం బాగోలేదని స్వయంగా ఒక భక్తుడు ఫిర్యాదు చేసిన పరిస్థితుల్లో సందర్శిస్తామని చెప్పిన డీసీ ఇప్పటి వరకు ఆలయానికి రాలేదు. హోమం చేసుకునే అర్చకులు నుంచి రూ.300 వరకు వసూలు చేసిన సిబ్బంది కనీసం శుభ్రం కూడా చేయించకపోవటం అర్చకులు, దాతలే శుభ్రం చేసుకుంటున్నారు. ఆలయాల్లో జరుగుతున్న తప్పులపై 'స్పందిచయ్యా.. శ్రీనివాసా' అని భక్తులు కోరుకుంటున్నారు.

ఫిర్యాదులపై విచారణ లేదు..

నగరంలోని నాజ్‌సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు, సిబ్బంది అక్రమ వసూలుకు పాల్పడుతున్నారని నేరుగా కమిషనర్ నుంచి జిల్లా ఏసీ వరకు ఫిర్యాదులు అందాయి. విచారణకు స్వయంగా ఆర్జేసీ విచారణకు వస్తున్నారనే సమాచారంతో ఇప్పటికే అక్రమ చందాలు వసూలు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న అర్చకులు, సిబ్బంది దాతలను స్వయంగా కలిసి మరీ విచారణ జరిగిన సమయంలో డబ్బులు ఇవ్వలేదని చెప్పండని వారిని ప్రాధేయపడుతున్నట్లు సమాచారం.

డివిజన్‌లలో మెరుగైన పారిశుద్ధ్యానికి చర్యలు



కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, డివిజన్ వారీగా మెరుగైన పారిశుద్ధ్య పనులు జరిగేలా ప్రజారోగ్య అధికారులు బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గోరంట్ల, అరండల్‌పేట, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగానికి అదనపు కార్మికులను, వాహనాలను, చెత్త సేకరణకు పుష్‌కాట్స్ ఇచ్చినప్పటికీ ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శుల పర్యవేక్షణ లోపం వలన ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యం అందడం లేదన్నారు. కార్మికులు తమకు కేటాయించిన ఇళ్లల్లో నూరు శాతం చెత్త సేకరణ చేయాలని, మధ్యాహ్నం సమయంలో అంతర్గత డ్రెయిన్లను శుభ్రం చేయాలని స్పష్టం చేశారు. ఇక నుంచి మధ్యాహ్నం సమయంలో కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఎస్‌లు క్షుణ్ణంగా పర్యవేక్షణ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుక్కల నియంత్రణలో వైఫల్యం

- ఈ నెల 6వ తేదీన కుక్క దాడిలో బాలుడి మృత్యువాత
- తాజాగా పిచ్చికుక్క దాడిలో 20 మందికి గాయాలు



గతంలో నీటితొట్టెల ఏర్పాటుకు విడుదల చేసిన జీఓ

నెహ్రూనగర్: నగరంలో కుక్కల నియంత్రణకు నగరపాలక సంస్థ వైఫల్యం కనిపిస్తోంది. ఈ నెల 6వ తేదీన కుక్క దాడిలో స్వర్ణభారతీ నగర్‌కు చెందిన బాలుడు మృతి చెందిన ఘటన మరువకుండానే తాజాగా సోమవారం ఏటీ అగ్రహారం పిచ్చి కుక్క సుమారు 20 మందిని గాయపరిచింది. దీంతో వారంతా జీజీహెచ్‌కు వెళ్లి చికిత్స చేయించుకుని వెళ్లిపోయారు.

వేసవిలో నీరు, ఆహారం లేక దాడి

వేసవిలో వీధి కుక్కలకు సరైన నీరు లేక, ఆహారం లేక దారిన పోయే వారిపై దాడులు చేస్తుంటాయి. వీటి నియంత్రణకు నగరపాలక సంస్థ పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆ దిశగా అడుగులు వేయడం లేదు. 2017లో వీధి కుక్కల దాహార్తిని తీర్చేందుకు నగరపాలక సంస్థ నీటి తొట్టెలను నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన విషయాన్ని జంతు ప్రేమికులు చెబుతున్నారు. కాని ప్రస్తుతం వాటిని నీటి తొట్టెలు ఏర్పాటు చేయడంలో అధికారులు వైఫల్యం చెందినట్లు వారు ఆరోపిస్తున్నారు.

ఏబీసీ ఆపరేషన్లు చేస్తారంట!

ఈ నెల 6వ తేదీన కుక్క దాడిలో మరణించిన బాలుడి ఉదాంతంతో సీఎం చంద్రబాబు యుద్ధ ప్రతిపాదికన ఏబీసీ ఆపరేషన్లు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో ఏదో ఒక చోట వీధి కుక్కల దాడిలో నగర వాసులు గాయాలపాలవుతున్నా నగరపాలక సంస్థ అధికారులు ఇంత వరకు ఆపరేషన్లు ప్రారంభించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీనిపై నగరపాలక సంస్థ వెంటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎం వెంకటేశ్వర్లు వివరణ కోరగా బుధవారం నుంచి వీధి కుక్కలకు ఆపరేషన్లు ప్రారంభిస్తామని చెప్పారు.

తెగిపోయిన చేతిని అతికించారు..



ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్: మోచేతి వరకు పూర్తిగా కట్ అయి విడిపోయిన యువకుడి చేతిని విజయవంతంగా ఆపరేషన్ చేసి అతికించినట్లు గుంటూరు ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకులు, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పి.కృష్ణ శ్రవంత్ తెలిపారు. మంగళవారం గుంటూరువారితోటలోని ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బిహార్‌కు చెందిన వ్యక్తి చేయి పూర్తిగా కట్ అయి గోనె సంచిలో చేతిని వేసుకుని 2024 డిసెంబరులో ఆస్పత్రికి వచ్చారన్నారు. పేషెంట్ వచ్చిన 15 నిమిషాల్లోనే చికిత్స మొదలు పెట్టి, డిసెంబర్ 12న, 2025 మార్చి 4 న అరుదైన శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేశామన్నారు. ఆపరేషన్‌కు దాదాపు 7 నుంచి 8 గంటల సమయం పట్టిందని, ఎనిమిది యూనిట్లు రక్తం ఎక్కించి ఆపరేషన్ చేశామన్నారు. ప్రస్తుతం అతను చేతి వేళ్లు కదిలిస్తున్నట్లు వెల్లడించారు. ప్రముఖ హ్యాండ్ సర్జన్ డాక్టర్ బిందేష్ మాట్లాడుతూ చేతులు, కాళ్లు కట్ అయితే ఆ భాగాలను సెలైన్ బాటిల్‌లో గానీ నీటిలో గానీ పెట్టి ఐస్ ప్యాక్‌లో ఆసుపత్రికి తీసుకు రావాలన్నారు. వేలు కట్ అయితే నాలుగు గంటల్లోపల ఐస్ ప్యాక్‌లో తేవాలన్నారు.

తూకంలో తేడాలు వస్తే చర్యలు



రైతుబజారులో కాటాలను చెక్ చేస్తున్న ఈఓ ఫణిబాబు

కొరిటెపాడు(గుంటూరు): వినియోగదారులకు కచ్చితమైన కాటాలు వేసి కూరగాయలు ఇవ్వాలని, తూకాల్లో తేడాలు వస్తే సహించేది లేదని పట్టాభిపురం రైతు బజారు ఎస్టేట్ అధికారి వాకా ఫణిబాబు హెచ్చరించారు. పట్టాభిపురం రైతుబజారులో పలువురు వినియోగదారుల ఫిర్యాదు మేరకు రైతుబజారును మంగళవారం తనిఖీ చేశారు. తూనికలు, కొలతల శాఖ నుంచి ప్రత్యేక రాళ్లు తెప్పించి రైతుబజారులోని షాపుల్లో కాటాలను సరి చేయించారు. ఈ సందర్భంగా ఎస్టేట్ అధికారి ఫణిబాబు మాట్లాడుతూ వినియోగదారులకు కరెక్టుగా కాటా వేసి కూరగాయలు అందించాలన్నారు. అంతేకాకుండా వినియోగదారులతో దురుసుగా మాట్లాడటం, గొడవలు పడటం చేస్తే షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆఫీసు కార్యాలయం వద్ద ధర్మ కాటా పెట్టడం జరుగుతుందని, వినియోగదారులకు అపనమ్మకం ఏర్పడితే ధర్మ కాటాలో తూకాలు వేసుకొని చూసుకోవచ్చన్నారు. రైతుబజారులోని ప్రతి షాపు వద్ద కూరగాయలకు సంబంధించి ధరల పట్టిక ఏర్పాటు చేయడం జరుగుతుందని, పట్టికలో ఉన్న ధరలకే కూరగాయలు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

లెనిన్ ఆశయాలను కొనసాగిద్దాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



సీపీఐ జిల్లా కార్యాలయంలో లెనిన్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న రామకృష్ణ

లక్ష్మీపురం: ప్రప్రథమ సోషలిస్టు రాజ్య స్థాపకులు వి.ఐ.లెనిన్ ఆశయాలను కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. కొత్తపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో ఉన్న లెనిన్ జయంతిని పురస్కరించుకుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ.. లెనిన్ 1917లో, అక్టోబర్ మహా విప్లవం వల్ల రష్యాలో ప్రప్రథమ సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, బీపీటీఏ జాతీయ కార్యదర్శి గని, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, నాయకులు ఆకిటి అరుణ్ కుమార్, ఆర్.అంజిబాబు, జి.సురేష్ బాబు, ఎం.శ్రీనివాసరావు, యశ్వంత్, జి.లక్ష్మి, ఎస్.చిన్నా, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి పాల్గొన్నారు.

మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి

లక్ష్మీపురం: మే 20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి పిలుపునిచ్చారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశం మంగళవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గంలోకి, ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకెళ్లాలని చెప్పారు. జిల్లాలో వేలాది మంది కార్మికులు సమ్మెలో పాల్గొనే విధంగా కృషి చేయాలని కోరారు. సమ్మె జయప్రదాన్ని కాంక్షిస్తూ ఈనెల 25వ తేదీన విజయవాడలో కార్మిక సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడారు. సమావేశంలో జిల్లా కోశాధికారి పి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కె.మాల్యాద్రి, చిన్ని సత్యనారాయణ, ప్రభాకర్, జి.సురేష్ బాబు, ఆర్.అంజిబాబు, ఎం.శ్రీను, కె.వీ రాంజనేయులు, డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్వంలో అత్యంత అందమైన గ్రహం భూమి



గుంటూరు ఎడ్యుకేషన్: విశ్వంలో అత్యంత అందమైన గ్రహంగా ఉన్న భూమిపై పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా, అవర్ స్టేట్ అవర్ లీడర్ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు జి.శాంతమూర్తి తెలిపారు. భారత్‌పేటలోని నగరపాలకసంస్థ పాఠశాలలో మంగళవారం ధరిత్రీ దినోత్సవం సందర్భంగా 'విశ్వంలో అత్యంత అందమైన గ్రహం భూమి 'అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శాంతమూర్తి మాట్లాడుతూ జల కాలుష్యం, వాయు కాలుష్యంతో సమానంగా భూమి ప్లాస్టిక్ వాడకంతో కలుషితమైపోతోందని అన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.

ఏబీసీ కేంద్ర నిర్మాణం పట్ల నిరసన



పెదకాకాని: కుక్కల కుటుంబ నియంత్రణ కేంద్ర నిర్మాణంపై మంగళవారం గ్రామ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని పెదకాకాని తక్కెళ్లపాడు గ్రామాల మధ్య గుంటూరు కార్పొరేషన్ అధికారులు యానిమల్ బర్త్ కంట్రోల్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ భవన నిర్మాణంలో భాగంగా ఆ ప్రదేశంలోని పెద్ద చెట్లను తొలగించారు. ఏటుకూరు రోడ్డులోని ఏబీసీ కేంద్రాన్ని తక్కెళ్లపాడు శివారుకు మార్చడంతో చుట్టు పక్కల గ్రామాలకు కుక్కల వల్ల దుర్వాసన, వాటి బెడద ఎక్కువ కావడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయని నిరసన తెలిపారు. దీనిపై గత సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు కూడా చేశారు. చెట్లు నరకడంపై పెదకాకాని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ అక్కడికి చేరుకుని పరిశీలించారు.

వైద్య కళాశాలలో డైనింగ్ రూమ్ ప్రారంభం



డైనింగ్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో 1997 బ్యాచ్ వైద్య విద్యార్థులు విరాళంతో అందించిన డైనింగ్ టేబుల్ రూమ్‌ను మంగళవారం గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, పూర్వ వైద్య విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. కళాశాల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు చేస్తున్న సాయాన్ని అభినందించారు. అనంతరం హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్ కళాశాలల క్రికెట్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన వైద్య కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ చికిత్సా కేంద్రాలు తనిఖీ



గుంటూరు సిబ్బందితో ఏపీ శాక్స్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠారెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాలలో హెచ్‌ఐవీ బాధితులకు చికిత్స అందిస్తున్న కేంద్రాలను మంగళవారం ఏపీ శాక్స్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ నీలకంఠారెడ్డి తనిఖీ చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు చేసే ఐసీటీసీ కేంద్రంలో ఏ కిట్‌లతో హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తున్నారు.. బాధితులకు ఏవిధంగా కౌన్సెలింగ్ చేస్తున్నారు.. రికార్డులు ఏవిధంగా నిర్వహిస్తున్నారనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గర్భిణుల విభాగంలో ఏవిధంగా టెస్టులు చేస్తున్నారు.. బాలింతల నుంచి పుట్టబోయే బిడ్డలకు హెచ్‌ఐవీ సోకకుండా ఏవిధమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారనే విషయాలను పరిశీలించారు. హెచ్‌ఐవీ బాధితులు ఏఆర్టీ కేంద్రంలో ఏవిధంగా చికిత్స పొందుతున్నారు.. అక్కడ ఉన్న వైద్య సౌకర్యాలు, వారు తీసుకుంటున్న మందులు, తదితర విషయాలన్ని రికార్డులు పరిశీలించారు. అనంతరం గుంటూరు వైద్య కళాశాలలో వైరల్‌లోడ్ మిషన్‌ను ఎస్‌ఆర్‌ఎల్ ల్యాబ్‌ను పరిశీలించారు. తనిఖీల్లో ఏపీశాక్స్ ఐసీటీసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్, శ్యామ్‌సన్, జ్యోతుల వీరాస్వామి, సుకుమార్ పాల్గొన్నారు.

మహాభారతం అరణ్య పర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం



మాట్లాడుతున్న శ్రీకూర్మనాథస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం మహాభారతం అరణ్య పర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. గుదిమెళ్ల శ్రీకూర్మనాథ స్వామి మాట్లాడుతూ మహాభారతంలో వన వాసం పాండవుల జీవితంలో ఒక కీలక ఘట్టమని అన్నారు. పాచికల ఆటలో ఓడిపోయి, 13 ఏళ్ల బహిష్కరణకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ వనవాస కాలంలో పాండవులు అడవుల్లో గడిపారని పేర్కొన్నారు. యుధిష్ఠిరుడు జూదంలో ఓడిపోవడంతో పాండవులు 12 ఏళ్లు అరణ్య వాసం, ఒక ఏడాది అజ్ఞాత వాసం చేయాల్సి వచ్చిందని చెప్పారు. వనవాస సమయంలో పాండవులు అడవుల్లో గడిపిన సమయంలో ఋషుల నుంచి జ్ఞానాన్ని పొందారని పేర్కొన్నారు. నారదుడు, ద్వైమానుడు వంటి ఋషులు వారికి అనేక కథలు, సూక్తులను చెప్పారని తెలిపారు.

ఘనంగా లెనిన్ జయంతి



లెనిన్ చిత్రపటం వద్ద నివాళి

లక్ష్మీపురం: మార్క్సిజం, లెనిన్‌నిజాన్ని ప్రస్తుత పరిస్థితుల్లో మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఎం సీనియర్ నాయకుడు పాశం రామారావు పేర్కొన్నారు. సీపీఎం కార్యాలయంలో లెనిన్‌జయంతి మంగళవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ చరిత్రలో అసాధ్యమనుకున్న దానిని సుసాధ్యం చేసిన ధీశాలి లెనిన్ అన్నారు. దేశంలో కార్మిక చట్టాలను రద్దు చేస్తూ పెట్టుబడి దారులకు, పారిశ్రామికాధిపతులకు ప్రజల సొమ్మును కారు చౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పీ–4 పేరుతో వేల ఎకరాల భూములను 99పైసలకే లీజుకు ఇవ్వడం చూస్తే ఆందోళన కలుగుతోందని చెప్పారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, పారిశ్రామికులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, జిల్లా నాయకులు బి.లక్ష్మణరావు, వై.కృష్ణకాంత్, కె.నాగేశ్వరరావు, ఎం.సాంబశివరావు, నికల్సన్ ఖాశింషహీద్, ఎస్.పద్మ, ఎ.కళ్యాణి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

ప్రత్తిపాడు: పెదనందిపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఎన్‌సీడీ సీడీ 3.0 సర్వే వివరాలతో పాటు పీఎంజేఏవై, ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్, వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేల్లో అలసత్వం లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు.